ఉత్తరద్వార దర్శనం.. భక్తజన సందోహం

మార్మోగిన గోవింద నామస్మరణ

కాళ్ల: కాళ్ల మండలం కాళ్లకూరులోని స్వయంభూః శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) గీతా జయంతి, పర్వదినం కావడంతో స్వామివారు భక్తులకు శనివారం ఉత్తర ద్వారం గుండా దర్శనమిచ్చారు. కాళ్లకూరు గ్రామమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. స్వామివారిని తెల్లవారుజామున నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తులు దర్శించుకున్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ గోకరాజు రామరాజు దంపతులు, ఎమ్మెల్యే మంతెన రామరాజు దంపతులు, డీఎన్ఆర్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు నరసింహారాజు కుటుంబ సభ్యులు, పశ్చిమగోదావరి జిల్లా దేవదాయ శాఖ కమిషనర్ భీమవరం పరిధి ఆలయాల ఇన్స్పెక్టర్, అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు. భక్తులకు దేవస్థానం వారు పులిహోర, మంచినీరు, చిన్నారులకు, వృద్ధులకు పాలు పంపిణీ చేశారు. కాళ్లకూరు గ్రామ పెద్దలు, గ్రామస్తులు భక్తులకు సహాయ సహకారాలు అందించారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భీమవరం డీఎస్పీ, సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వైష్ణవాలయాల్లో భక్తుల సందడి

ఆకివీడు : ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివార్ల దర్శనం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద క్యూ కట్టారు. ఆకివీడు మండలం చెరుకుమిల్లి, దుంపగడప వరద రాజస్వామిఆలయం, ఆకివీడు వేణుగోపాల స్వామి, మాదివాడ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. పలు ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లను దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇ.సుబ్బారావు పర్యవేక్షించారు. వేద పాఠశాలలో వేంకటేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. ముక్కోటి రోజునే హాలాహలం, అమృతం పుట్టాయని అధ్యాపకుడు లింగాల దుర్గా ప్రసాద్ వివరించారు. మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునుడికి ముక్కోటి ఏకాదశి రోజునే బోధించరని గీత చెబుతుందని అన్నారు. ఆకివీడు వేంకట లింగేశ్వరస్వామి, కోదండ రామాలయం, చినకాపవరం బుచ్చి వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు.


కాళ్ల: విశేష కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి


భీమవరం (ప్రకాశం చౌక్): హౌసింగ్ బోర్డు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మోషేన్‌రాజు


ఆకివీడు: ప్రత్యేకాలంకరణలో వేణుగోపాలస్వామి


భీమవరం అర్బన్: గొల్లవానితిప్ప రామాలయంలో స్వామి వారిని దర్శించుకున్న మహిళలు

భీమవరంలో..

భీమవరం (ప్రకాశంచౌక్): ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వరస్వామివారు భక్తులకు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. పట్టణంలోని దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రుద్రరాజు గంగా శ్రీదేవి, ధార్మిక పరిషత్ సభ్యులు, దేవస్థాన చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం ద్వారా శాసన మండల చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, జిల్లా విద్యాశాఖాధికారి రమణ, ఆర్డీఓ శ్రీనివాసుల రాజు, మున్సిపల్ కమిషనర్ శ్యామల తదితర ప్రముఖులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లం వెంకట నాగ రమేష్– సత్యవాణి దంపతులు స్వామివారి భోగ మూర్తులకు కిలో వెండి సింహాసనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కార్యదర్శి కుక్కల బాల, కమిటీ సభ్యులు తాటికొండ కోటేశ్వరరావు గుప్త, సరిపిడకల రామారావు, జానపాటి మధు, అల్లూరి బంగార్రాజు, కదలి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్పలో ఉన్న శ్రీ సీతాసమేత కోదండరామాలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొప్పర్తి నరసింహస్వామి – నాగ వెంకటలక్ష్మి దంపతులతో కలశ పూజ, గౌరీ, విఘ్నేశ్వర, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళ తాళాలతో, డప్పు వాయిద్యాలతో గ్రామంలో పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వివిధ వంటకాలతో సుమారు 4 వేల మంది భక్తులకు ఘనంగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను శ్రీ సీతారామ ఆధ్యాత్మిక సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం


గుర్రం బెన్‌హర్

కాళ్ల: వైఎస్సార్ సీపీలో పనిచేసేవారికి గుర్తింపు లభిస్తుందనడానికి తానే నిదర్శనమని ఆ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి గుర్రం బెన్‌హర్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తనను గుర్తించి పార్టీ క్రిస్టియన్ మైనారిటీ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి తనకు బాధ్యతను మరింత పెట్టిందని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉండిలో పీవీఎల్ నర్సింహరాజు గెలిపే తన లక్ష్యమని వివరించారు. ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీలకు అండగా నిలుస్తానని తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కి ఎన్నార్పీ అగ్రహారం విద్యార్థి


సింహాద్రి అప్పన్న

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి వి.సింహాద్రి అప్పన్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కి ఎంపికైనట్టు హెచ్ఎం ఎంవీ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో భీమవరం మండలం చినఅమిరం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ వ్యక్తిగత విభాగంలో సింహాద్రి అప్పన్న ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో కడపలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కి ఎంపికైనట్టు చెప్పారు. గైడ్ టీచర్ ఎన్ సుబ్బరాజు, విద్యార్థి అప్పనన్నను హెచ్ఎం, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం మాజీ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అన్నారు. భీమవరంలో శనివారం కల్లుగీత కార్మిక సంఘం 31వ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ గీత కార్మికులను కార్పొరేషన్ల పేరుతో విడగొట్టడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో కేతా సూర్యారావు, కామనమునిస్వామి, కడలి పాండు, బొక్కా చంటి, జుత్తిగ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

సాగిరాజుకు గోదావరి మాత పురస్కారం

భీమవరం: పరిశోధనా రంగంలో రచయితగా డాక్టర్ సాగిరాజు సత్యనారాయణరాజు చేస్తున్న కృషికి రుద్రరాజు ఫౌండేషన్ గోదావరి మాత పురస్కారంతో సత్కరించనుంది. ఈ నెల 25న గణపవరంలోని శ్రీకన్యకా పరమేశ్వరి వర్తక సంఘం భవనంలో ఆర్ఎస్ రాజు, చంద్రావతి జయంతి సందర్భంగా సత్యనారాయణరాజును సత్కరించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి తెన్నేటి మాస్టారు శనివారం విలేకరులకు తెలిపారు.

ఫార్మసీ రంగంలో ఉన్నత ఉద్యోగావకాశాలు

భీమవరం: నూతన సాంకేతికతను నేర్చుకోవడం ద్వారా ఫార్మసీ రంగంలో ఉన్నత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని భీమవరం విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ అన్నారు. శనివారం గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీఫార్మసీ, ఫార్మా డీ విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేశారు. కళాశాల అడ్మిన్ డైరెక్టర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' ర్యాలీలు

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడా నైపుణ్యాలను వెలికితీసే కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఆడుదాం ఆంధ్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని తహసీల్దార్ వై.శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.కొండలరావు అన్నారు. శనివారం ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ కె.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఉండి సచివాలయం వద్ద నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 26న ఉండి జెడ్పీ హైస్కూల్ వేదికగా క్రీడలు మండల స్థాయిలో ప్రారంభమవుతాయని, తొలుత ఉండి సెంటర్ నుంచి 2 కిలోమీటర్లు మారథాన్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, షటిల్, కబడ్డీ క్రీడలు నిర్వహించి విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ, మండల పరిషత్ అధికాలు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉండిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఆడుదాం ఆంధ్రకు 4,652 మంది నమోదు

పాలకోడేరు: ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో పాల్గొనేందుకు ఇప్పటికీ 4,652 మందిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు ఎంపీడీఓ కాకర్లమూడి నాగేంద్ర కుమార్ తెలిపారు. ఇప్పటికే క్రీడాకారుల రిజిస్ట్రేషన్, ప్రచారం బాధ్యతలు చేపడుతున్న వాలంటీర్లకు అంపైరింగ్‌పై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. తొలి దశలో గ్రామ సచివాలయాల పరిధిలో జరిగే క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలకు వారు రిఫరీలుగా వ్యవహరిస్తారని తెలిపారు. పీఈటీల కొరత నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ బాధ్యతలు అప్పగిస్తూ న్నామని చెప్పారు.

సమాజ పురోభివృద్ధికి నాటక రంగం దోహదం

వీరవాసరం: సమాజ పురోభివృద్ధికి నాటక రంగం ఎంతో దోహదం పడుతుందని డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకట స్వామి తెలిపారు. తోలేరులో నిర్వహిస్తున్న 19వ జాతీయ స్థాయి నాటికల పోటీలు శనివారం పసుపులేటి నాగేశ్వరరావు కళా ప్రాంగణంలో బహుమతి ప్రధానోత్సవంలో ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరాలకు తెలియజేసే నాటకాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ నాటక రంగ అభివృద్ధికి, కళాకారుల పురోగతికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ప్రముఖ సినీ నటుడు, దర్శకులు సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ నాటక రంగం నుంచేఎంతోమంది కళాకారులు సినీ రంగంలో వినీలాకాశంలో మెరిసారని గుర్తు చేశారు. ప్రజా స్వామ్య పరిరక్షణకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య శర్మను నిర్వాహకులు సత్కరించారు. కళాపరిషత్ అధ్యక్షుడు చావాకుల సత్యనారాయణమూర్తి, చినిమిల్లి వెంకటరాయుడు, పోలిశెట్టి సత్యనారాయణ, రాయప్రోలు భగవాన్, వంగా నర్సింహరావు పాల్గొన్నారు.


తోలేరులో సుబ్రహ్మణ్య శర్మను సత్కరిస్తున్న దృశ్యం

జగన్ ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం

భీమవరం: రాష్ట్రంలో సామాజికన్యాయం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమైందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ సెల్ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. శనివారం భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతూ బీసీ, ఎస్సీలకు ప్రభుత్వంలో అత్యధిక పదవులిచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు తలెత్తుకుని తిరుగుతున్నారంటే ముఖ్యమంత్రి అందించిన పథకాలే కారణమన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇస్తున్నట్లు చెప్పారు. క్రైస్తవ మిషనరీ ఆస్తులను కొల్లగొట్టిన మాజీ సీఎం చంద్రబాబు ఎస్సీలు, క్రైస్తవులపై ప్రేమ చూపుతున్నారని మండిపడ్డారు. జగన్ దళితుల పక్షపాతి జగన్‌కు రానున్నెన్నికల్లో దళితులంతా మద్దతుగా ఉంటారని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తెన్నేటి కిరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు చీర సునీల్ బాబు, బిరదా సందీప్ తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న మంగరాజు

నేటి నుంచి హనుమద్ వ్రత వార్షికోత్సవాలు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మారుతీ టాకీస్ సెంటర్‌ని దాసాంజనేయ స్వామి 43వ హనుమద్ వ్రత వార్షికోత్సవాలు ఆదివారం నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణ అధికారి గొట్టిముక్కల నాగ సీతారామరాజు మాట్లాడుతూ ఆదివారం కలశస్థాపన, స్వామి గ్రామోత్సవం, 25న సత్యనారాయణ స్వామి వ్రతం, 26న సత్యనారాయణ వ్రతం, సామూహిక లక్ష తమలపాకుల పూజ, సింధూరం పూజ, 27న 108 కలశాల సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో అభిషే కాలు, లక్ష తమలపాకుల పూజ, 28న 108 కలశాల సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో అభిషేకాలు, లక్ష తమలపాకుల పూజ, భారీ అన్నసమారధన నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుల నియామకం


అశోక్‌కుమార్‌వర్మ


గణేశ్వరరావు


సురేష్

భీమవరం: భీమవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగ అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. భీమవరం పట్టణ యువజన విభాగం అధ్యక్షుడిగా నడింపల్లి అశోక్‌కుమార్‌వర్మ, మండలానికి జవ్వాది గణేశ్వరరావు, వీరవాసరం మండలం యువజన విభాగం అధ్యక్షుడిగా కందుల సురేష్ నియమితులయ్యారు.

వైఎస్సార్‌సీపీ మండల యువజన కమిటీల ఏర్పాటు

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలోని మండల యువజన కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల యువజన విభాగాల అధ్యక్షుల్ని ప్రకటించారు. ఆకివీడు పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడిగా జోగి నాగరాజు, మండల యువజన కమిటీ అధ్యక్షుడిగా చిక్కాల రామాంజనేయులు (చిన్నా), కాళ్ల మండల యువజన కమిటీ అధ్యక్షుడిగా విగ్నేష బాలవెంకటనాగరాజు, ఉండి మండల యువజన కమిటీ అధ్యక్షుడిగా బాలం వెంకట తులసి వెంకటేశ్వర్లు, పాలకోడేరు మండల యువజన కమిటీ అధ్యక్షుడిగా పెన్మెత్స వెంకట రాజులను నియమించారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సూచనలతో కమిటీల ఏర్పాటు జరిగింది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార కిట్ల పంపిణీ


శృంగవృక్షంలో పోషకాహార కిట్లు అందిస్తున్న దృశ్యం

పాలకోడేరు: అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో సచివాలయ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వలంటీర్లు సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పోషకాహారం పంపిణీ చేస్తున్నట్టు ఆకివీడు ఐసీడీఎస్ సీడీపీఓ వాణీ విజయ రత్నం తెలిపారు. ఆకివీడు, ఉండి, కాళ్ల, పాలకోడేరు మండలాల్లోని 261 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 2,600 మంది గర్భిణులు, బాలింతలు, 2400 మంది చిన్నారులకు పోషకాహార కిట్లు అందజేస్తున్నట్టు చెప్పారు. చిన్నారుల హాజరు సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నట్టు చెప్పారు. అన్ని కేంద్రాలకు న్యూట్రిషన్ కిట్ల స్టాకు వచ్చిందని తెలిపారు.

భూమిసేద్యపు హక్కునకు టెండరు కమ్ బహిరంగవేలం ప్రకటన

ప.గో॥జిల్లా వీరవాసరం మండలం, వీరవాసరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ వీరేశ్వర విశ్వేశ్వర & సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాల & సీతారామస్వామి మరియు కనకదుర్గ అమ్మవార్ల దేవస్థానముల యొక్క హక్కు భుక్తములలో ఉండియున్న వీరవాసరం గ్రామంలో గల దిగువ సుదహరించిన భూములను 2023-24 సం॥రం॥ రెండోవ పంటకు అనగా దాళ్వా పంటకు సేద్యము చేసుకొను లైసెన్సు హక్కును పొందుటకు ది.6-1-2024 తేది శనివారం మధ్యాహ్నం గం.2.00లకు శ్రీ స్వామి వారి దేవస్థానం వద్ద దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల వారి సమక్షమున సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే టెండరు కమ్ బహిరంగ వేలం నిర్వహించబడును. ఆసక్తి గలవారు పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వ.నెం	భూమి ఉన్న గ్రామం	రీ సర్వే నెం.	విస్తీర్ణం య.సెం	చెల్లించ వలసిన ధరావత్తు మొత్తం సొమ్ము
1	వీరవాసరం	1461/2	2 - 00	5000/-
2	వీరవాసరం	1461/2	0 - 80	2000/-
3	వీరవాసరం	231/2	0 - 71	2000/-
4	వీరవాసరం	226/3	0 - 32	1000/-